క్లుప్తంగా

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

నరసాపురం: ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు విభాగాలుగా విభజించి సేకరిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని చెప్పారు. నరసాపురాన్ని క్లీన్ పట్టణంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రజలు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్

యలమంచిలి: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఓదూరి సూర్యప్రకాశరావు, తోలేటి పార్వతి, అధ్యక్షుడిగా పీతల రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్వరరావు జనరల్ సెక్రెటరీగా వై సురేష్ బాబు, జాయింట్ సెక్రెటరీగా కె.గౌరీ భవానీ, కోశాధికారిగా బిహెచ్‌వివి సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శిగా మన్నే మాధురి తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత, ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్ అభినందించారు.

పట్టణ ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంబటి



ఫైనాన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఫైనాన్సియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంబటి మురళీకృష్ణను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఫైనాన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా అంబటి మురళికృష్ణ, సెక్రెటరీ చిలుకూరి రామ సతీష్, ట్రెజరర్ గమిని శ్రీను, ఉపాధ్యక్షుడు అంగర నరసింహరావు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం గౌరవ అధ్యక్షులు కారుమూరి శ్రీరాములు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఛాంబర్ కార్యదర్శి కనుమూరి సీతారామరాజు, వలవల రవీంద్రనాథ్, మరిడి ప్రభాకరరావు, తొట్టెంపూడి కోటేశ్వరరావు, యాతం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సప్త శ్రీనివాస క్షేత్ర దర్శనానికి ప్రత్యేక సర్వీసులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారయణ మూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసంలో ఒకే రోజున సప్త (7) శ్రీనివాస క్షేత్రాలు దర్శించుకునేందుకు ప్రతి శనివారం ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. కలియుగం దైవం వేంకటేశ్వర స్వామి క్షేత్రాలైన అప్పనపల్లి, వాడపల్లి, ద్వారకాతిరుమల, పారిజాతగిరి దర్శనం, అబ్బిరాజు పాలెం, కొడమంచిలి, అన్నవరప్పాడు దర్శనాలకు ప్రత్యేక ఆర్టీసి బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ బస్సులు ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజున రాత్రి 8 గంటలకు డిపోకు చేరుకుంటాయని, పల్లె వెలుగు రూ.350, ఎక్స్‌ప్రెస్ రూ.400, అల్ట్రా డీలక్స్ రూ.500 చొప్పున ధరలతో ధనుర్మాస శ్రీనివాస దర్శన సర్వీసులు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 73829 24754, 96660 89036 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

వైభవంగా శాంతి కల్యాణం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డు పద్మావతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం స్వామి వారికి కాకులపాటి వీరఘవులు, నూకరాజశ్వరిదేవి దంపతులతో శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే లక్ష తులసి పూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, పూర్ణహూతి తదితర పూజలు చేశారు.

వాతావరణ మార్పులతో రైతుల బెంబేలు



వాతావరణ మార్పులతో ధాన్యాన్ని ఎడ్ల బండిపై తీసుకువస్తున్న దృశ్యం



టార్పాలిన్‌తో కప్పి ఉంచిన ధాన్యం

ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు ఉరుకులు పరుగులు

వాయుగుండం ప్రభావంతో నరసాపురం ప్రాంతంలో కూడా వర్షాలు విస్తారంగా కురుస్తాయనే వార్తలతో రైతుల గుండెల్లో మరోసారి గుబులును పుట్టిస్తోంది. ఈ సార్వా సాగు ప్రారంభం నుండే వర్షాలు వరదలతో నానా ఇబ్బందులు పడిన ఈ ప్రాంత రైతాంగం చాలా వరకూ సాగును ఆరంభంలోనే విడిచిపెట్టారు. మిగిలిన కొద్దిమంది సాగు చేసిన పంట కూడా చేతికందే సమయంలో కొన్ని రోజుల క్రితం వచ్చిన తుపాను వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే పంట చేతికి వచ్చే తరుణంలో వెంట వెంటనే మరోసారి తాజాగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వీస్తున్న ఈదురుగాలులకు తీరప్రాంత వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఊడ్చిన కొద్దిపాటి వరిచేలు కోతలు పూర్తయి చివరి దశలో ఉన్నాయి. ముఖ్యంగా రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం అల్పపీడన హెచ్చరికలతో రైతులు వేగంగా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు.

– నరసాపురం రూరల్



హడావుడిగా ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతు కూలీలు



రుస్తుంబాదలో ధాన్యం పట్టుబడి పడుతున్న దృశ్యం



మల్లవరంలో రైసుమిల్లు వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న దృశ్యం

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సరిగ్గా మలుపులో గొయ్యిగా ఉండటంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సినిమాహాళ్లు, ఆసుపత్రులు ఇటువైపు ఉండడంతో నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు ఈ అంశంపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

లింగ వివక్షపై అవగాహన



అరట్లకట్టలో లింగ వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: స్త్రీ, పురుషులు సమానమనే భావన బాల్యదశలోనే విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ అరుణకుమారి చెప్పారు. మండలంలోని అరట్లకట్టలో ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో బుధవారం లింగ వివక్షపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధ, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలిబాలికల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎల్‌టీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమన్వయంతోనే సుస్థిరాభివృద్ధి



నరసాపురం రూరల్: శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు



పాలకొల్లు అర్బన్: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణలో పాల్గొన్న అధికారులు

నరసాపురం రూరల్: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళికతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి పని చేయాలని నరసాపురం ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసా కోటివీరభద్రరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని పలు అంశాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి పంచాయతీల్లో చేపట్టాల్సిన విధి విధానాలను గురించి సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ కాకర్లమూడి నాగేంద్రకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకేష్, ఏపీఎం నాగభూషణ నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి తొమ్మిది మానవ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నామని, ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. పేదరికనిర్మూలన, ఆకలి బాధలను నివారించి ఆహార భద్రతను కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, లింగ అసమానత్వం రూపుమాపడం వంటి లక్ష్యాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలి

పాలకొల్లు అర్బన్: మహిళలు వారి కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సుపరిపాలనకు గ్రామాభివృద్ధికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈఓపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు, వన్‌స్టాప్ సెంటర్ లీగల్ అడ్వయిజర్ పసుపులేటి దుర్గ గ్రామ సుపరిపాలనకు సంబంధించి 17 అంశాలు, 9 లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఏపీఎం ఎస్‌వీ ఆచార్యులు, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర, ఈవోపీఆర్‌డీ గుడాల హరిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.మల్లేశ్వరి, మంగ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అధ్వానం

నరసాపురం: స్థానిక మున్సిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. అధికారులు చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. దీంతో లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నీరుగారుతుంది. పట్టణంలో పలు దఫాలుగా పట్టణంలో అనేక మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరి గట్టు, వైఎన్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వే స్టేషన్‌రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. నాటిన మొక్కలను దూడలు తినేయడంతో పాటు ఉన్న కొద్దిపాటి మొక్కలకు నీళ్లు వేసి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఆ మొక్కల కూడా చచ్చిపోయాయి. ప్రతి ఏటా మునిసిపల్ బడ్జెట్‌లో మొక్కల పెంపకానికి నిధులు కేటాయిస్తున్నా, కొత్తగా ట్రీగార్డులు మాత్రం ఎక్కడా ఏర్పాటు చేయడం లేదు. మొక్కల సంరక్షణపై ఇప్పటికైనా దృష్టిపెట్టకపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



దొడ్డిపట్లలో పంచాయతీ కార్మికులు, ఉద్యోగులతో యూనియన్ నాయకులు

యలమంచిలి: పంచాయతీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలో వివిధ గ్రామాలలో బుధవారం ఆయన పర్యటించి పంచాయతీ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పంచాయతీ కార్మికుల వెతలు తీరడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్లు, ఎలక్ట్రీషియన్లు, ట్యాంక్ వాచర్లు, బిల్లు కలెక్టర్లు కనీస వేతనాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్నారన్నారు. పంచాయతీ ఆదాయంపై ఆధారపడి వీరికి జీతాలిస్తున్నారని, పంచాయతీలకు ఆదాయం లేదనే పేరుతో అరకొర వేతనాలు ఇచ్చి పని చేయించుకోవడం సమంజసం కాదన్నారు. పండుగలు, పెళ్లిళ్లు, ప్రభుత్వ సెలవులు, అనారోగ్యాలతో సంబంధం లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పనికి తగిన విధంగా వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



యలమంచిలి: మట్లపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్



నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

యలమంచిలి: భూమికి సంబంధించి ఏ సమస్యలు ఉన్నా రెవెన్యూ సదస్సులకు వచ్చి దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ అన్నారు. మీ భూమి–మీ హక్కు నినాదంతో బుధవారం ఉదయం మట్లపాలెం, మధ్యాహ్నం నారినమెరక గ్రామాలలో గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మట్లపాలెంలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఒకటి, రీప్లేస్‌మెంట్ పాస్ పుస్తకాల కోసం 12 మొత్తం 13 దరఖాస్తులు వచ్చాయి. నారినమెరకలో పట్టాదారు పాస్ పుస్తకం కోసం 5, రీప్లేస్‌మెంట్ కోసం 5, అడంగల్‌లో పేరు చేర్పు కోసం ఒకటి మొత్తం 11 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో మట్లపాలెం, నారినమెరక సర్పంచ్‌లు చల్లా వెంకట నాగలక్ష్మీ, వలవల లక్ష్మీ, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్, ఆర్ఐ యశోద, వీఆర్వోలు రమేష్, బాబ్జి, సర్వేయర్‌లు దామోదర్, కళాంజలి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరంలో..

నరసాపురం రూరల్: తగాదాలతో భూ సమస్యలు పరిష్కారం కావని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో సచివాలయం ఆవరణలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి మాట్లాడుతూ లక్ష్మణేశ్వరం–1, లక్ష్మణేశ్వరం.2 సచివాలయాల వద్ద నిర్వహించిన రెవిన్యూ సదస్సుల్లో ముటేషన్లు, పేర్లు తప్పుల సరిదిద్దడం, రిప్లేస్‌మెంట్ పాస్‌పుస్తకాలు కోసం, నోషనల్ ఖాతాల్లో తప్పుగా నమోదైన వాటిని మార్పు చేసి సరిచేయాలని కోరుతూ 17 ఫిర్యాదులు అందాయన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కుమార్, ఆర్ మిరియాల లక్ష్మీనారాయణ, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, వీఆర్వోలు భారతి, వెంకటేశ్వరరావు, చిరంజీవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలో విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులతో చిత్రలేఖన పోటీల విజేతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లజపతిరాయ్‌పేట చాబర్స్ కళాశాల రోడ్డులో ఉన్న శాంతి నివాసంలో కళా విశారధులు మార్లపూడి ఇజ్రాయేలు శత జయంతి సందర్భంగా ఎం.ఉదయ్ అధ్యక్షతన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బుధవారం ఉదయ్ ఆర్ట్ అకాడమి, ఫోరం పర్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీల్లో కట్టా మహేష్, భీమవరం రూ. 8 వేలు, ఎన్‌ఆర్ కుమార్ మండపేట రూ. 4 వేలు, గుబ్బల పద్మాకిరణ్ భీమవరం రూ. 3 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 9 మందికి కన్సోలేషన్ బహుమతులు రూ. 1000 లు చొప్పున, సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో నీల్‌కమల్ మూర్తి, తాళ్ల బాలు, వట్లూరి రామబ్రహ్మం, కాసా కోటి వీరభద్రం, పొన్నా సాయికృష్ణ, ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు పునఃప్రారంభం



పునఃప్రారంభమైన రైల్వే గేటు

ఉండి: రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం గత పది రోజులుగా మూసి ఉన్న ఉండి రైల్వే గేటు ఎట్టకేలకు బుధవారం తెరచుకుంది. ఈ నెల తొమ్మిది నుంచి మూసి వేసిన రైల్వే గేటును అధికారులు బుధవారం హడావుడిగా ప్రారంభించారు. అయితే ట్రాక్ మరమ్మతులు తదితర పనులు పూర్తయినా గేటు వద్ద రోడ్డు వేసే పని మాత్రం పూర్తి కాలేదు. రోడ్డును చదును చేసిన అధికారులు రైల్వే గేటును ఓపెన్ చేశారు. అయితే మరోసారి ఒకటి లేదా రెండు రోజులపాటు గేటు మూసేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

వలంటీర్లపై శీతకన్ను

గద్దెనెక్కాక మాటమార్చిన కూటమి సర్కార్



ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

యలమంచిలి: గత ప్రభుత్వంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేసిన వలంటీర్లు కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేయడంతో తమ ఉద్యోగాలపై ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రజల అవసరాలను తీర్చడంతో పారదర్శకంగా పని చేశారు. లంచాలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా ప్రజలకు అందజేశారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి కోరలు చాచిన సమయంలో వీరి పనితీరుపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి. ఎన్నికల సమయంలో వీరంతా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తారని కూటమి నాయకులు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల సంఘం వీరందరినీ విధుల నుంచి పక్కకు పెట్టింది. అదే సమయంలో వలంటీర్లు తమ ఉద్యోగాలపై ఆందోళన చెందవద్దని మా ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత మిమ్మల్ని కొనసాగించడంతో పాటు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా వలంటీర్ల ఉద్యోగ భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వ ప్రతినిధులు వలంటీర్ వ్యవస్థే లేదుకదా అంటూ మాట్లాడిన తీరుపై వలంటీర్లు మండిపడుతున్నారు. సీఎం చంద్రబాబు తమకు రూ. 10 వేలు చెల్లిస్తారని ఎదురు చూస్తున్న వలంటీర్లకు నిరాశే మిగింది. పాలకొల్లు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందజేసిన 1,028 మంది వలంటీర్లు ప్రభుత్వ పెద్దల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పాస్‌పోర్ట్ ఆఫీస్ వద్ద షెల్టర్ ఏర్పాటుకు చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుందరీకరణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రయాణికులకు, పాస్ పోర్ట్ కార్యాలయానికి వచ్చేవారికి షెల్టర్ ఏర్పాటు, జువ్వలపాలెం రోడ్డు అడ్డ వంతెన సమీపంలో బస్ షెల్టర్, ఏ ఎస్ ఆర్ నగర్ వాటర్ ట్యాంక్ ఆవరణలోని పార్కు అభివృద్ధికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలను జారీ చేశారు. ఏఎస్ఆర్ నగర్ లో హెడ్ వాటర్ ట్యాంక్ ఆవరణలో పార్కు సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. ముఖ్యంగా పాత బస్టాండు ప్రయాణికులు కోసం, సమీపంలో ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయానికి సుదీర్ఘ ప్రాంతాల నుండి ప్రజలు వస్తుంటారని వారు వేచి ఉండుటకు షెల్టర్ నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఈఈ త్రినాథరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీలక్ష్మి, డీఈ అప్పారావు ఉన్నారు.